



# ఇల్లు పట్టిన శని

శ్రీకృష్ణ

ఎక్కడో ఒంగోలు దగ్గర ఒక పల్లెటూరిలో పుట్టిపెరిగిన సరోజ తను భర్తతో కలిసి వెళ్ళబో యేది వైజాగ్‌లాంటి ఖరీదైన సిటీకి అనుకుంటే 2 సంవత్సరాల క్రితం మనస్సు గాలిలో తేలిపోయి ఒళ్ళు తెలియలేదు. ...చక్కగా బీచి ఒడ్డుకు షికార్లు, చూడడానికి బోల్డన్ని సినిమా లు, ఎంచగ్గా తామిద్దరే.. ఒకరికొకరు..హాయిగా ఆనందంగా.... ఇలా సాగిపోయాయి ఆమె ఆలోచనలు.

సారె తీసుకుని క్రొత్తగా కాపురానికి వెడదామని అత్తవారింటికి వచ్చింది. అక్కడ తమతో పాటు విశాఖకు సిద్ధమయిన విధవ ఆడబడుచును చూసి మతిపోయినంత పనయ్యింది సరోజకి. అసలు, తల్లి తండ్రులే కొత్త భార్యాభర్తల వెంట వెళ్ళడానికి వెనుకాడతారు. అలాంటిది ఈమె ఇలా వెంట బడడం... అసలు ఏమీ అర్థంకాలేదు. "మా సరోజ వయస్సులో చిన్నది. వంటలవీ ఏం తెలుస్తాయి? ఏదో నేను వాళ్ళ సంసారాన్ని అంతా చక్కపెట్టి కొన్నాళ్ళ పాటు ఆ అమ్మాయికి అన్నీ నేర్పివస్తాను" అంటూ తెలివిగా జవాబులిస్తూ విశాఖకు కాంతం తరలి వచ్చింది.

పెళ్ళయి ఆరు నెలలయినా భర్త స్వభావాన్ని సరిగా అంచనా వెయ్యలేకపోయింది సరోజ. మూర్తి గవర్న మెంట్ సంస్థలోనే ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆఫీస్‌కెళ్ళడం, తిన్నగా ఇంటికి వచ్చి ఏ పుస్తకమో చదువుకుని పడుకోవడం, ఇదీ అతని రోజువారి ముఖ్య కార్యక్రమం. సినిమాలు, షికార్లు అంటూ కలలు కన్న సరోజ మెల్లిగా వాటి స్థానాన్ని ఒక ప్రక్కన పెట్టవలసి వచ్చింది. ఇక ఆడబడుచుతో వెడదామన్నా, ఆవిడకి విపరీతమైన తలనొప్పి వస్తుందట. అడగ్గా అడగ్గా, మూర్తే ఎలాగో ఓపిక తెచ్చుకుని ప్రయాణమవుతాడు. తీసుకెళ్ళడం వరకే అతని డ్యూటీ. మిగతా సీనరీలన్నీ బొమ్మల్లా చూసి రావాలి అంతే. ఒక మాట వుండదు. పలుకు వుండదు. తాను చరచరా ముందుకు నడుచుకు పోతాడు. వెనుక పరుగులాంటి నడకతో అతనిని అందు కోవడానికి సరోజ అవస్థపడేది. ఈ మాదిరి తంతు జరుగుతుంటే ఇక విసుగేసి అతనితో కలిసి బయట కెళ్ళడం చాలా మటుకు తగ్గించేసుకుంది.

ఏదో తన ఉద్యోగం, తిండి ఇవే చూసుకొంటాడు గాని నలుగురిలో తిరగడం గాని, తెలివిగా మసులుకొని పనులు చేయించుకోవడం కాని మూర్తికి తెలియవు. తెలియని వాటి గురించి ఏదైనా సరోజ చెప్పబోతే మూడ్ బాగుంటే వింటాడు. బాగోలేకపోతే ముఖం గంటుపెట్టుకుని పుస్తకంలో తలదూరుస్తాడు. భర్తకి లోకజ్ఞానం అంతంత మాత్రమేనని, తనే తెలివిగా మసులుకోవాలని సరోజ ఇప్పుడిప్పుడే భావిస్తుంది. కానీ వీళ్ళిద్దరి మధ్య ప్రతి విషయానికి కాంతం పానకంలో పుడకలా నేనూ వున్నానని అడ్డుపడుతూ వుంటుంది.

నిస్సారంగా వున్న జీవితంలో తొలకరి జల్లు కురిసినట్లయ్యింది విశ్వం రాక. విశ్వం సరోజకి అన్న వరస అవుతాడు. ఇద్దరిదీ ఒకే ఊరు. బంధుత్వం కూడా కలవడంతో సరోజను సొంత చెల్లెలికంటె కూడా ఎక్కువగా అభిమానిస్తాడతను. విశాఖకు కొత్తగా బదిలీ మీద వచ్చాడతను. అతని భార్య ప్రభ కూడా మంచి కలుపుగోరు మనిషి. తరచుగా వాళ్ళ ఇంటికి వెళ్ళి

## రుడ్‌యార్డ్ కిప్లింగ్ వ్యాఖ్యపై వచ్చిన కథలు

శ్రీ బీయార్ — 'చిదంబర రహస్యం'
శ్రీ ఆర్.వి.రమణ ప్రసాద్ — 'వల'
శ్రీ విరించి — 'అకారణం'
శ్రీమతి ఎం.విద్యుల్లత — 'ఓహ్హో! నా పెళ్ళామా'
శ్రీమతి భాగవతుల లలిత శర్మ — '(అ) సావేరి'
శ్రీ వెల్చేరు చంద్రశేఖర్ — 'క్లెవర్ గర్ల్'
శ్రీమతి కొవ్వలి నాగేశ్వరి — 'ఆకూ-వక్క'
శ్రీమతి నెల్లూరి పార్వతీదేవి — 'ఇల్లుపట్టిన శని'
శ్రీ ఎన్. జగన్ మాధవరావు — 'తెలివైన అర్ధాంగి'

ఈ మొత్తం తొమ్మిది కథలలో ఏది ఉత్తమమైనది నిర్ణయించే బాధ్యత పాఠకులదే. ఈ కథలను 17-1-86 సంచిక నుంచి ప్రచురిస్తున్నాము.

పాఠకులు కూపన్‌లో నాకు నచ్చిన కథ 'పేరును వ్రాసి పంపితే ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు కథలకు 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలు ఇప్పటి వరకూ లభ్యమైనవి చెరి ఒక సెట్ బహూకరిస్తాము. పాఠకులు 9 కథలను వరుసగా చదవాలి. 9 వ కథ ప్రకటించిన వారం రోజుల వరకు పాఠకులు తమ ఓట్లను పోస్ట్ కార్డుల ద్వారా కూడా తెలియపరచ వచ్చును.

—ఎడిటర్

### నాకు నచ్చిన కథ కూపన్

కథ పేరు ---------------------------

పంపిన వారి పేరు --------------------

చిరునామా ---------------------------

(సంతకం)

కబుర్లతో కాలం గడపడంతో సరోజలో కొత్త ఉత్సాహం ప్రోది చేసుకుంది. అలా వెడుతున్నందుకు మూర్తి ఏమనేవాడు కాదు గాని, కాంతం గొణుక్కునేది. ఆమె మాటలను అంత లెక్క చేసేది కాదు సరోజ. ప్రభకి ఒక ప్రయివేట్ సంస్థలో టైపిస్ట్‌గా ఉద్యోగం దొరికింది. వాళ్ళ బాబుని చూడడానికి ఊరినుండి మేనత్తను తోడు తెచ్చుకుంది.

ఒకసారి వాళ్ళింటికి వెళ్ళిన సరోజకి భార్య భర్త ఇరువురు ఏదో చర్చించుకుంటూ కన్పించారు.

"ఏమిటన్నయ్యా సంగతి?" అంటూ తాను ఒక కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఇల్లు కడదామని ఆలోచిస్తున్నానమ్మా..." అంటూ అసలు సంగతి బయటపెట్టాడు.

"అదేమిటే? మీకు ఊర్లో ఇల్లుందిగా?"

"ఉంది. వుంది. దానిని మా ఇద్దరన్నదమ్ములు పంచుకోవాలి. ఒక్కొక్కరికి రెండు గదులు కన్నా ఎక్కువ రావు. ఇక అన్నయ్య సంగతి నీకు తెలిసిందేగా. తను దేనికీ కలిసిరాడు. ఆ ఇంట్లో మేం ప్రక్క ప్రక్కన వుంటే ఇక అంతే సంగతులు. మీ వదినకి ఈ వైజాగ్, ఇక్కడి పరిసరాలు బాగా నచ్చాయి. ఉద్యోగం కూడా తనకి ఇక్కడ బాగా వీలుగా వుంది. అందుకని ఇక్కడే ఇల్లు కట్టుకుని సెటిలయితే బాగుంటుందని..." పూర్తి చేశాడతను.

"చాలా మంచి ఆలోచన అన్నయ్యా! తప్పకుండా మీరు ఇల్లు కడతారు" అని సంతోషం వెలిబుచ్చింది.

ఇంకా ఏదో ఆలోచిస్తున్న ప్రభ ముఖంలోకి చూస్తూ "ఏమిటొదినా? ఇక దేనికి ఆలోచన?" అంది.

"అది కాదు సరోజా! మా దగ్గర ప్రస్తుతం 40 వేలున్నాయి. ఇల్లు కట్టాలంటే ఇంకో 30 వేలన్నా చేత్తో పట్టుకోవాలి. మా అన్నయ్యది మంచి బిజినెస్ కదా! ఆయనను డబ్బు అడగమంటున్నాను. అప్పు రూపంగానే సుమా! ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. తీర్చెయ్యలేమూ?"

"నాకదే ఇష్టం లేదు" అంటూ విశ్వం తల అడ్డంగా ఊపాడు.

విషయం సీరియస్ అయినప్పటికీ, ఒకరి అభిప్రాయాలు ఒకరు మన్నించుకుంటూ మాట్లాడే తీరు ఆమెకి బాగా నచ్చింది. తను కూడా కొంతసేపు మాట్లాడి ఇంటికొచ్చేసింది.

స్థలం కొనడం, పునాదులు వెయ్యడం, అంతా చకచక రోజుల మీద పని జరిపించేసాడు విశ్వం. ఊళ్ళో వున్న వాటా అమ్మి కొంచెం, లోను తీసుకుని కొంచెం డబ్బు సమకూర్చుకున్నాడతను. ఒకసారి ఇల్లు కడుతున్న చోటికి సరోజని తీసుకెళ్ళాడు.

అన్నీ చూపిస్తూ, "చూడు సరోజా! ఆ ప్రక్క స్థలం అమ్మకానికి సిద్ధంగా వుంది. మీకెలాగూ సొంత ఊర్లో ఇల్లు లేదు. నువ్వు కూడా ఇక్కడ చిన్న ఇల్లు కట్టుకుంటే, మనిద్దరం, ఒకరికొకరు అండగా వుంటాం" అన్నాడు.

"అవును సరోజా! మీకెలాగూ ఊరవతల పనికి మాలిన బీడు పడి వుంది. దానిని మీ ఆయన సాగుచేసి పంట పొలం చేస్తారన్నది కల్ల. అందుకని దానిని అమ్మెయ్యండి. తర్వాత లోనులో కూడా కొంచెం డబ్బు తీసుకున్నారంటే ఒకమాదిరి ఇల్లు కట్టెయ్యొచ్చు. ఈ ఊర్లో నెల నెలా అద్దె క్రింద ఎంత డబ్బు పొయ్యవలసి వస్తుందో చూస్తున్నావు కదా!" అంది ప్రభ.

సాలోచనగా ఆ విషయమే ఆలోచిస్తూ ఇంటికెళ్ళి రాత్రి భర్తకి అంతా వివరించి చెప్పింది. సొంత ఇల్లు అనేటప్పటికి కొంచెం ఊపు వచ్చింది అతనికి కూడా. మర్నాడు తాను కూడా సరోజతో పాటు విశ్వం దగ్గరకి బయలుదేరాడు. ఆ మాత్రానికే సరోజ పొంగిపోయింది. స్థలం అదీ చూశాడు. కొంటానని చెప్పాడు. తిరిగి చీకటి పడుతుండగా ఇంటికి వచ్చేసారు.

మర్నాడు స్థలం అమ్మే అతని ఇంటికి వెడదామని అతనిని బయలుదేరదీసింది.

ఉన్న చోటునుండి కదలకుండా "అబ్బే, ఆ స్థలం నేను కొనాలనుకోవడం లేదు. ఏదోలాగా మీ అన్నయ్యకి ఆ సంగతి చెప్పెయ్యి" అంటూ తాపీగా పుస్తకంలోకి తలదూర్చాడు.

"ఏం? ఎందుకని..." ఒళ్ళు మండుకుపోతుంటే అడిగింది.

"ఎందుకమ్మాయి? గొడవ... ఈ ఊళ్ళో ఇక స్థలాలే లేవా అది తప్పితే..." అంటూ దీర్ఘం తీసింది కాంతం.

'అహ... ఈవిడ ఏదో నూరిపోసింది...'అనుకుంది.

మర్నాడు అసలు విషయం ప్రక్కింటి గౌరి చెప్పింది.

"మా సరోజ అక్కడ ఇల్లు కట్టిందంటే సంవత్సరానికి 9 నెలలు వాళ్ళన్న ఇంట్లోనే వుంటుంది. మా వాడసలే అమాయకుడా... అన్నా చెల్లెళ్ళిద్దరూ వాడిని బాగా ఆడించేస్తారు..."అందిట.

'విశ్వం ఎంత గౌరవంగా చూస్తాడు తన భర్తని. అయినా అక్క అంటే మాత్రం ఇతనికి తెలివి వుండొద్దూ... కొంటానని చెప్పి తిరిగి వెనక్కి తిరిగి పోవడం ఏం మర్యాద? ఎంత మంచి స్థలం అది. ఇంకో చోట అయితే ఎంత ఎక్కువ డబ్బు ముట్టచెప్పాలో...'

ఆదిలోనే హంసపాదు అన్నట్లు నిరుత్సాహంలో పడిపోయింది సరోజ.

విశ్వం ఇల్లు కట్టడం పూర్తి అయింది. ప్రభ ముఖంలో కొత్త కొత్త కాంతులు చిమ్ముతుండగా గృహప్రవేశం చేశాడతను.

అప్పుడు మరోసారి ఇల్లు విషయం గుర్తుచేసింది ప్రభ.

ఇంకోచోట స్థలం చూడమని అన్ననే అడిగింది సరోజ.

పదిహేను రోజుల్లో ఇంకో స్థలం చూసి, చూడడానికి రమ్మని కబురు పెట్టాడతను. ఈసారి స్థలం చూడడానికి కాంతం కూడా వచ్చింది. ఆ స్థలంలో రెండు మూరు పాకలు పడివున్నాయి. ఆ స్థలం గలాయనికి నాల్గు గేదెలు వుండేవట. ఇప్పుడు కొడుకు ఇంటికి మకాం మారుస్తూ, గేదెలను బావమరిది ఇంటికి తోలేశాడు. స్థలం అమ్మకానికి వచ్చాక ఈ పాకలవీ కూడా తీసేసి గుంజలు బావమరిది ఇంటికి పంపేస్తా

డట. వివరాలన్నీ తెలుసుకుని ఇంటికి వచ్చేసారు.

రాత్రి భోజనాలు అయ్యాయి. "అయితే, ఆ స్థలం ఖాయం అయినట్లేనా?" సరోజే ముందు కదిపింది.

"అబ్బ... ఆ గేదెలను అక్కడ ఎన్నాళ్ళబట్టి మేపుతున్నాడో అతను. ఆ పేడ... ఆ కంపు... ఒక నిమిషం భరించలేకపోయాను. చూస్తూ చూస్తూ ఆ పాక స్థలంలో ఇల్లు కట్టుకోవాలంటే ఏదోలా అనిపిస్తుంది..." కంపరంగా చెప్పింది కాంతం.

అసలు ఈవిడ తమని ఇల్లు కట్టనిస్తుందా అని అనుమానం వచ్చింది సరోజకి.

భర్త ఏమంటాడోనని అతని వంక చూసింది.

"పోనీ ఇంకో స్థలం చూసుకుంటే..." అక్క మాటలకు వత్తాసుగా అన్నాడు.

"అహా... ఇంకో స్థలం చూసిపెట్టడానికి మా అన్నయ్యకి తీరిక దొరుకుతుంది. అదింకో నాల్గువేలు ధర పలుకుతుంది. అప్పుడు మీరు కొని ఇల్లు కడుదురు గాని..." అంటూ విసురుగా పలికి రూంలోకి వచ్చేసింది.

'అసలు తన భర్తకి బుర్ర వుందా? ఏదో పాతకాలం మనిషి కాంతం. తనకి తెలియదనుకోవచ్చు. ఈయన ఉద్యోగం చేస్తున్న మనిషాయె! ఆ మాత్రం తెలుసుకోవద్దూ? ఆ స్థలం శుభ్రం సంగతి అన్నయ్య చూసుకుంటానని చెప్పాడు కదా, ఇక సమస్య దేనికో...' ఆలోచిస్తూ చాలా రాత్రి గడిచాక నిద్రపోయిందామె.

మర్నాడు వంటచేసి పుస్తకం చదువుతుంటే బ్యాంకులో డబ్బు డ్రా చేసుకొచ్చాడు మూర్తి.

ఆమె ఒళ్ళో డబ్బు పడేస్తూ "సాయంకాలం మీ అన్నయ్య ఇంటికెళ్ళి ఆ స్థలం కొనిపించుకురా..." అంటూనే వచ్చినంత వేగంగా తిరిగి ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు. అక్కడే కూర్చుని జాకెట్ కుట్టుకుంటున్న కాంతం ముఖం పాలిపోవడం గమనించిందామె. అంత ఏడుపెందుకో అర్థం కాలేదు.


అనుకొన్న స్థలం దొరికింది. భర్త చేత లోనుకై అప్లికేషన్ పెట్టించింది. నెలరోజులు గడిచాయి.

"వర్షాలు వచ్చేస్తాయమ్మా! ఇల్లు తొందరగా మొదలెట్టాలి..." అంటూ విశ్వం గొడవ చెయ్యసాగాడు. లోను సంగతి చెప్పింది. ఒకసారి తనుకూడా మూర్తి ఆఫీస్‌కెళ్ళి కనుక్కుంటానని అన్నాడు.

మర్నాడు మధ్యాహ్నం నల్లగా కమిలిన ముఖంతో విశ్వం ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో అతని రాకకు ఆశ్చర్యపోయింది సరోజ.

"తృణమో పణమో ముట్టచెప్పంది, ఈ రోజుల్లో ఏం పనవుతుంది? అయినా ఏడేళ్ళబట్టి పనిచేస్తున్నాడు. ఆ మాత్రం తెలియకపోతే ఎలా? లోను అప్లికేషన్ పెట్టి చక్కా ఊరుకున్నాడు మీ ఆయన. అది కాస్త ఇన్నాళ్ళు సెక్షన్ ఆఫీసర్ గారి సొరుగులో పడివుంది. ఇవాళ ఒక వంద మామిడిపళ్ళ బుట్ట పట్టుకెళ్ళి సమర్పించుకుంటే అది అక్కడి నుంచి కదిలింది. ఇక బెంగపడకు. లోను డబ్బు వచ్చేస్తుంది" అన్నాడు.

అన్న తెలివిగా శాంక్షన్ చేయించినందుకు నవ్వాలో, భర్తని విమర్శించినందుకు ఏడవాలో తెలియలేదామెకు.




లోను డబ్బు వచ్చింది. బీడు అమ్మకం కూడా అయ్యింది. ఇల్లు కట్టడం మొదలుపెట్టారు. భర్త తోటి 40 రోజులు సెలవు పెట్టించింది. ఇవన్నీ చూస్తూ కాంతం ఇంకా ఉడికిపోసాగింది. అస్తమాను ఏదో ఒక మాట పిల్లిమీద ఎలకమీద వంకపెట్టి అనేది.

'తను తన పుట్టింటికి ఏం దోచిపెట్టడం లేదు కదా! తమ కోసమే కదా ఇల్లు కట్టించుకొంటూంది... అది అర్థం చేసుకోదే ఈ మనిషి?...' అనుకుంది. అయినా రెండు నెలలు వుండి వెళ్ళిపోతానన్న మనిషిని 2-1/2 సంవత్సరాలు వుంచుకుని పెద్దదానిగా గౌరవించడం తాము చేసిన పొరపాటేమో అనిపించింది.

మేస్త్రీ లెక్కలు, కూలీల రోజువారి డబ్బు అంతా గజిబిజిగా అనిపించసాగాయి మూర్తికి. విసుగు ఎక్కువయ్యింది. దానికి తోడు వాళ్ళకి కావలసిన వన్నీ ఎప్పటికప్పుడు బజారుకెళ్ళి తేవలసి వచ్చేది. ఎండలో అలా సైకిలుమీద తిరగడం అలవాటు లేక ఊరికే హైరాన పడిపోసాగాడు.

"మీరు చెయ్యకపోతే ఎలాగండీ? అలా విసుక్కుంటే ఆ మేస్త్రీకి ఇంకా కోపం రాదు?" అని నిలదీసింది ఒకరోజు సరోజ.

"అసలు... నువ్వు మొదలెట్టావు. ఎవరితో చేయించుకుంటావో పనులు, నీ ఇష్టం. నీవే చూసుకో అంతా. నా వల్ల కాదు" అని గట్టిగా చెప్పేసి ఇంటికెళ్ళిపోయాడతను. అతను అలా కోపంగా చెపుతూ వెళ్ళిపోతుంటే మేస్త్రీ కూలీలు వాళ్ళిద్దరి వంకా ఎగాదిగా చూడసాగారు. భూమిలో అక్కడే కూరుకుపోతే బాగుణ్ను అనిపించిందామెకు.

ఒకసారి దిగాక... తప్పదు కదా... అందులో విశ్వం సెలవంతా ముందే వాడేసుకున్నాడు. వచ్చినట్లు ఇంటికి కబురంపి తమ్ముణ్ణే రప్పించుకుంది.

ఆ సమస్య అలా తీరిందనుకుంటే ఇంకొకటి వచ్చిపడింది. ఇల్లు కట్టేవాళ్ళు రోజూ మధ్యాహ్నం ఒట్టి టీ గాక, ఏదో ఒక టిఫిన్ చేసి పెట్టి తీరాలన్నారు.

తాను, తమ్ముడు ఇల్లు కట్టించడం దగ్గర వున్నారు కనుక ఆడపడుచుని టిఫిన్ చేసి భర్తచేత పంపించమని ఇంటికి కబురుపెట్టింది.

ఒకర్తినీ ఇంటిపనీ, వంటపనీ చేసుకోలేకపోతున్నాను. మళ్ళీ మధ్యాహ్నం టిఫిన్ చేయడం నావల్ల కాదు... అంటూ కాంతం తిరిగి బదులిచ్చింది.

'తన అత్తగారింట్లో ఎప్పుడూ పదిహేను మందికి వండి వడ్డించే ఆవిడ, ఇక్కడ నలుగురికి టిఫిన్ చెయ్యలేకపోతుందంటే ఎవరు నమ్ముతారు? తన మీద కసి తీర్చుకుంటుందావిడ...' అనుకుంది.

'అంతా నా ఖర్మ' అని తలకొట్టుకుంది. అది చూసి ఏమనుకున్నాడో, ఏమో..."రోజూ నేను మధ్యాహ్నం హోటలుకెళ్ళి తెచ్చిస్తాలే" అని అన్నాడు మూర్తి. గుడ్డిలో మెల్ల అని నిట్టూర్చింది.

గదులు కట్టడం అయ్యింది. పనిలో పని రంగులవీ వేయించుకోవడం, బయట ఇనుపగేటు పెట్టించుకోవడం అంతా చేయించుకోమన్నాడు విశ్వం. భర్తని అడిగింది. అతనికి కూడా భార్య తెలివితేటల మీద నమ్మకం వచ్చింది గామోసు. ఆ ఉత్సాహంలో సరే నన్నాడు. ఒక 1000 రూపాయిలు మాత్రం ప్రక్కన పెట్టి మిగతా డబ్బుతో మిగిలివున్న పనులన్నీ చేయించింది.

ఆ రోజుతో ఇంటిపని పూర్తయినట్లే. తమ్ముడు సినిమా కెళ్ళాడు. కాంతం గుడికి వెళ్ళింది. మంచం మీద పడుకున్న సరోజకి చాలా అలసటగా వుంది. ఈ ఇంటి గొడవలో పడి ఆమె తన ఆరోగ్యాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. చిక్కి సగమయ్యింది. ఇంటిలో చిన్న చిన్న గొడవలు... బయట డబ్బు వ్యవహారంతో తల బొప్పి కట్టిందామెకు. 'ఏమైతేనేం దేవుని దయవలన వుండడానికి ఇంత గూడు తయారయ్యింది. అదే పదివేలు!' అనుకుని ఆ సంధ్యా సమయంలో దేవునికి మనసారా నమస్కరించింది.

చేటలో బియ్యం ఏరుతున్న సరోజ ముందుగదిలో

మాటలు వినపడడంతో చేస్తున్న పని ఆపి చెవి రిక్కించి వినసాగింది.

"అది కాదురా... అబ్బాయి, మా పినమామ గారిని కూడా రమ్మని వ్రాయకపోతే ఎలా? మా అత్తగారిని పిలిచి వాళ్ళని పిలవకపోతే బాగుంటుందా?" కాంతం చిన్నగా మాట్లాడుతుంది.

"సర్లే, వాళ్ళకి కూడా లెటర్ వ్రాస్తాను" అంటున్నాడు మూర్తి.

ఏమిటీ వీళ్ళ మంతనాలు అనుకుంటూ హాలులోకి వచ్చింది.

మరదలిని చూస్తూనే ఇష్టంలేనట్లు ముఖం చిట్లించింది కాంతం.

"దేనికి ఉత్తరాలు వ్రాయడం?" అడిగింది.

"మన ఇంటి గృహ ప్రవేశానికి రమ్మని..." బదులిచ్చాడు.

"అసలు ముహూర్తం ఎప్పుడు నిర్ణయించారో?... ఇంట్లో వాళ్ళకి కూడా చెప్పకుండా..." కావాలనే 'వ్యంగ్యంగా అడిగింది.

"మొన్న అక్క గుడిలో పంతులుగారిని అడిగి కాగితం మీద వ్రాయించుకొచ్చింది. ఈ నెల 10న మన గృహప్రవేశం. ఇదే గదా మన ఇంటిలో మొదటి కార్యం. అందుకనే మీ తరపువాళ్ళకి, మా తరపు వాళ్ళకి అందరినీ రమ్మని ఉత్తరాలు వ్రాస్తున్నాను."

ఒళ్ళంతా భగభగ మండసాగింది సరోజకి. 'పగలనరాత్రనక శారీరకంగా, మానసికంగా కష్టపడి ఈ నాటికి ఇంటికి ఒక రూపం తీసుకువచ్చింది తను. నాల్గుసార్లు ఎండలో తిరిగి విసుక్కుని ఈయన, టిఫిన్ పంపించమంటే కసురుకుని ఆవిడ పని ఎగ్గొట్టారు. ఇప్పుడు తగుదునమ్మా అంటూ తనకి కూడా ముందు తెలియపరచకుండా గృహప్రవేశం... ఆహ్వానాలు అంటూ మర్యాదలు చెయ్యడానికి బయలుదేరుతున్నారు...

అసలు తన బంగారం మంచిదయితే... మిగతా వాళ్ళని అనుకోవచ్చు!'అనుకుంటూ మూర్తిపైన లోలోనే విసుక్కోసాగింది. కాని పైకి మాత్రం ఏం తేలకుండా,

"అహ... ఇప్పుడన్నా నాకు చెప్పారు. సంతోషం. మన దగ్గర ప్రస్తుతం 1000 రూపాయలే వున్నాయి. ముఖ్యమైన వాళ్ళనే పిలుచుకుని పొదుపుగా ఖర్చుకానిస్తే చాలా మంచిది" విసురుగా అంది.



"అయితే వచ్చిన వాళ్ళను మర్నాడే పంపేస్తావా? పల్లెటూరి నుండి పనిగట్టుకు వస్తారు వాళ్ళు. వాళ్ళకి సిటీ అంతా మన ఖర్చులతో చూపించొద్దూ! ఆడవాళ్ళందరికి రవికల గుడ్డలు పెట్టాలి. భోజనాలు అవీ అంతా వెయ్యి రూపాయిలతో ఏమవుతాయి? ఖర్చు అని ఇప్పుడు వెనకాడితే తర్వాత మనకి మిగిలేది అవమానమే" ఈసడింపుగా అంది కాంతం.

"అయితే అప్పు చేసి పప్పుకూడు పెట్టమంటారా?" కోపంగా అడిగింది.

"అప్పు అయితే అయ్యిందిలే. అందరినీ పిలవకపోతే బాగుండదు" అన్నాడు మూర్తి.

'అసలు... ఈ మనిషికి ఏమన్నా తెలుస్తుందా? ఇల్లు కట్టి వున్న డబ్బు అంతా ఖర్చు పెట్టారు. ఇక గృహప్రవేశం అయ్యాక కూడా చిన్న చిన్న పనులకు ఖర్చుచెయ్యాల్సి వుంటుంది. అన్నీ తెలిసి కూడా అప్పు అంటే అదేదో తేలికయిన విషయంలా మాట్లాడుతాడే...'

"అయితే అదేదో మీరే తేల్చుకోండి... నా మాట ఎప్పుడు సరిగ్గా విన్నారు కనుక..." అంటూ విసురుగా వంటగదిలోకి వచ్చేసింది.

మర్నాటి నుంచి అక్కగారు లిస్టు వ్రాసివ్వడం. తమ్ముడుగారు బజారువెళ్ళి సంచులు, సంచుల సరుకులు మోసుకురావడం... అన్నీ కళ్ళప్పగించి చూస్తుంది సరోజ. బంధువులందరికి ఉత్తరాలు వెళ్ళాయి.

అన్నగారికి స్వయంగా చెప్పడానికి బయలుదేరబోతుంది ఆవాళ.

"నీ గాజులివ్వు..."అంటూ అడిగిన మూర్తిని చూసి ఒక్కసారి ఉలిక్కిపడింది సరోజ.

"ఎందుకు?"

"ఖర్చులకు డబ్బు లేదు... బ్యాంకిలో పెట్టి తెద్దామని."

"ఏం అప్పేదో చేస్తానన్నారుగా... ఎవరినన్నా అడగలేకపోయారా?"

"నాకంతగా పెద్ద సాయం చేసేవారు ఎవరూ లేరిక్కడ."

"అందుకని నేను గాజులు ఇచ్చి రేపొద్దున నలుగురిలో బోసిగా తిరగాలా?"

దానికి జవాబివ్వక "ఇవ్వు, నేను వెళ్ళాలి..." గట్టిగా గొంతు పెంచి అడిగాడు.

"అయితే ఇవ్వక తప్పదా... " నిస్సహాయురాలై కళ్ళనీళ్ళు తిరుగుతుండగా అడిగింది.

అదంతా గమనించే సున్నితత్వం అతనిలో లేదు. ఒకవైపు కాంతం హేళన చూపులు. మరొక వంక చెప్పిన పని వెంటనే చెయ్యక మొండికేస్తున్న భార్య. సహనం నశించింది.

అంతే... చెంప చెళ్ళున పేలి సరోజకి కళ్ళముందు చీకట్లు ముసిరాయి. విసురుగా తనే గాజులు తీసుకుని వెళ్ళిపోయాడతను.

'తను తన తెలివితేటలతో మగవాడిలా వ్యవహరించి ఇల్లు కట్టగలిగింది. కాని తెలివితక్కువ మగడితో ఎలా మసలుకోవాలో తెలియక చెంపదెబ్బ తింది. తెలివికి, చేసిన శ్రమకు ఫలితం ఇదా! ఇంకా ముందు జీవితంలో ఇలాంటివి ఎన్ని అనుభవించాలో...'అనుకుంటున్న సరోజకి ఏడుపు ఉప్పెనలా ముంచుకురాగా మంచం మీద బోర్లా పడిపోయింది.

